సాక్షి
ఖమ్మం
గురువారం । 21 । మార్చి । 2024




సరిహద్దులపై ప్రత్యేక నిఘా
ఎన్నికల వేళ మద్యం, నగదు అక్రమంగా తరలించకుండా జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేపడుతున్నారు. 8లో



ఉచ్చులకు కొండగొర్రె బలి
కారేపల్లి మండలంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చులకు తాకి కొండగొర్రె బలి కాగా.. నిందితులను అధికారులు గుర్తించారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
36° / 21°
జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.



ఈ గండం గట్టెక్కేదెలా..?




నీరు లేక వెలవెలబోతున్న పాలేరు రిజర్వాయర్ (ఇన్‌సెట్) రిజర్వాయర్ వద్ద మిషన్ భగీరథ ప్రాజెక్టు

జిల్లాలో వట్టిపోతున్న తాగునీటి వనరులు

- పాలేరు, వైరా రిజర్వాయర్లలో కనిష్టస్థాయికి నీటిమట్టం
- సాగర్ జలాల విడుదలపై కానరాని స్పష్టత
- ఇదిలాగే కొనసాగితే తాగునీటికి ఇక్కట్లే...




అడుగంటిన వైరా రిజర్వాయర్ (ఇన్‌సెట్) ఇన్ టేక్‌వెల్‌ల వద్ద తక్కువగా ఉన్న నీరు

కనిష్టస్థాయికి పాలేరు..

8.25 అడుగులకు పడిపోయిన రిజర్వాయర్

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం రోజురోజుకు గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా, బుధవారం నాటికి 8.25 అడుగులకు పడిపోయింది. ఇదిలాగే కొనసాగితే వారం రోజుల్లో రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీకి చేరనుంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ 2.558 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.721 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. పాలేరు నుండి ప్రతిరోజు తాగునీటి పథకాలకు 135.45 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తుండగా.. ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు ఇంకొన్ని రోజులకే సరిపోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూడు జిల్లాలపై ప్రభావం

పాలేరులోని మిషన్ భగీరథ ప్రాజెక్టు నుండి ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ జిల్లాల్లోని 2,439 ఆవాసాలకు తాగునీరు సరఫరా అవుతుండగా.. రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీకి చేరితే ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోనుంది. దీంతో పాటు కూసుమంచి మండలంలోని మరో 75 ఆవాసాలకు తాగునీరు అందించే పాత ప్రాజెక్టులకూ అదే పరిస్థితి ఎదురవుతుంది. ఎండలు పెరుగుతూ తాగునీటికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యాన కల్పతరువుగా మారిన పాలేరు అడుగంటుతుండడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇక ఖమ్మం కార్పొరేషన్ వాసులకు సైతం పాలేరు ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు పాలేరు ఎండిపోతే ఖమ్మం వాసులకే నీటి ఇబ్బందులు ఎదురుకానున్నాయి. కాగా, రిజర్వాయర్ ఆధారంగా మిషన్ భగీరథ, డీఫ్లోరైడ్ ప్రాజెక్టులను నిర్మించగా.. వాటి పంప్ హౌజ్‌లకు నీరు చేరే ప్రాంతాన ఇసుక మేటలు వేసింది. దీంతో ప్రాజెక్టులకు నీరు అందకపోవడంతో అధికారులు పొక్లెయినర్లతో ఇసుక తొలగించి నీరు అందిస్తున్నారు.

సాగర్ జలాలు వచ్చేనా?

ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటగా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోపక్క పాలేరు రిజర్వాయర్ సైతం డెడ్‌స్టోరేజీ సమీపానికి చేరింది. ఈనేపథ్యాన పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ నీటిని విడుదల చేస్తేనే కష్టాలు తీరనున్నాయి. ఈ విషయమై జిల్లా జలవనరుల శాఖ అధికారులు గతనెలలోనే ప్రభుత్వానికి నివేదించారు. ఆ సమయానికి రిజర్వాయర్‌లో ఉన్న నీరు మార్చి 15వరకు సరిపోతుందని, ఆలోగా సాగర్ జలాలు వస్తాయని భావించారు. కానీ నీటి విడుదలపై స్పష్టత రాకపోవడంతో తాగునీటి సమస్యను ఎలా అధిగమించాలా అన్న ఆందోళన అధికారుల్లో వ్యక్తమవుతోంది. సాగర్ జలాల విడుదలపై ఇప్పుడేమీ చెప్పలేమని, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఓ అధికారి తెలిపారు.

అడుగంటుతున్న వైరా రిజర్వాయర్

18.3 అడుగుల్లో ప్రస్తుతం 10.10 అడుగులే..

వైరా: వైరా రిజర్వాయర్‌లో రోజురోజుకు నీటిమట్టం పడిపోతోంది. మరో రెండు నెలలు ఇదే పరిస్థితి ఉంటే వేసవిలో తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా, ప్రస్తుతం 10.10 అడుగులకు పడిపోయింది. రిజర్వాయర్ నుండి జిల్లాలోని 11 మండలాలకు మిషన్ భగీరథ ద్వారా నిత్యం కోటి లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం 1.3 టీఎంసీల నీరు ఉండగా.. రోజుకు 37 క్యూసెక్కులను తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు.

వైరాకు కటకటే...

వైరా రిజర్వాయర్ నుండి జిల్లాలోని 11 మండలాలకు తాగునీరు అందుతోంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో వైరా మున్సిపాలిటీతో పాటు మండలంలోని 22 జీపీలు, మూడు శివారు గ్రామాలకు బోడేపూడి సుజల స్రవంతి పథకం ద్వారా నీరందే పరిస్థితి కనిపించడం లేదు. ఇరవై ఏళ్ల క్రితం ఆనాటి అవసరాల నిమిత్తం ఈ పథకాన్ని నిర్మించగా.. పెరిగిన జనాభాకు అనుగుణంగా నీటి వినియోగం పెరిగింది. అయితే, ప్రస్తుతం రిజర్వాయర్ అడుగంటుతుండడంతో ఇంకో పది రోజుల తర్వాత ఇన్ టేక్‌వెల్‌కు నీళ్లు అందే పరిస్థితి లేదు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయంగా బోడేపూడి సుజలస్రవంతి ఇన్ టేక్‌వెల్ పైప్‌లైన్‌ను భగీరథ పైప్‌లైన్‌కు కలపాలనే ఆలోచన చేసినా, ఇన్ టేక్‌వెల్ పూడికతో నిండి ఉండడంతో ఫలించకపోవచ్చని తెలుస్తోంది. రిజర్వాయర్‌లో రెండు రోజులకు ఒక అంగుళం మేర నీరు తగ్గుతున్న నేపథ్యాన సుజల స్రవంతి పథకానికి ఇంకో పది రోజుల్లో నీళ్లు అందడం కష్టమేనని చెబుతున్నారు.

మిషన్ భగీరథకు ఓకే...

వైరా రిజర్వాయర్ నుండి వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధి కొణిజర్ల, చింతకాని, మధిర ఎర్రుపాలెం, ఏన్కూరు జూలూరుపాడు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల్లోని 476 గ్రామాల్లో 5.40 లక్షల మందికి రోజూ కోటి లీటర్ల మేర నీరు సరఫరా చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మిషన్ భగీరథ ప్రాజెక్టుకు రూపకల్పన చేయడంతో మరో నెల వరకు ఢోకాలేదని అధికారులు అంటున్నారు. ఆతర్వాత ఎండలు ఇలాగే ఉంటే నీటి ఆవిరి శాతం పెరిగి భగీరథ ఇన్ టేక్‌వెల్‌కు సైతం నీరందడం కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది. అయితే, మరో అర టీఎంసీ సాగర్ జలాలను వైరా రిజర్వాయర్‌కు విడుదల చేయాలని అధికారులు ఇప్పటికే ప్రతిపాదించారు. కానీ సాగర్‌లో నీటి లభ్యత లేక విడుదల చేసే అవకాశం లేదని తెలుస్తోంది. దీంతో అధికారులు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని వైరా వాసులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల నియమావళిని అతిక్రమించొద్దు



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

వైరా/ఏన్కూరు: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అన్ని పార్టీల నాయకులు నిబంధనలకు లోబడి ప్రచారం చేసుకోవాలని వైరా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. వైరా తహసీల్‌లో బుధవారం ఆయన వివిధ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల నిబంధనలను వివరించడంతో పాటు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై చర్చించారు. అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, నాయకులు వెంకటనర్సిరెడ్డి, సుధాకర్, రవి, పాల్గొన్నారు. ఆతర్వాత ఏన్కూరు మండలం అక్కినాపురం తండా, భగవాన్‌నాయక్ తండా, మునియ తండా, గంగుల నాచారం,భద్రు తండా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించి విద్యుత్, తాగునీటి సౌకర్యాల కల్పనపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు



చెక్‌పోస్ట్‌లో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

నేలకొండపల్లి: ఎన్నికల నేపథ్యాన మద్యం, డబ్బు తరలించకుండా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు చేపట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. జిల్లా సరిహద్దు గ్రామమైన నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉద్యోగులకు సూచనలు చేయడంతో పాటు రిజిస్టర్లను పరిశీలించారు. ఎవరి వాహనమైనా సరే తనిఖీ చేయడంతో పాటు వీడియో చిత్రీకరించాలని సూచించారు. జిల్లా సరిహద్దు దాటి నగదు, మద్యం, ఇతరత్రా తాయిలాలు జిల్లాలోకి రాకుండా చూడాల్సిన బాధ్యత ఉద్యోగులపైఉందని తెలిపారు. ఆతర్వాత మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఓటర్లకు కల్పించాల్సిన వసతులపై చర్చించారు. తహసీల్దార్ గౌరీశంకర్, ఆర్ఐ ఆలస్యం మధుసూధన్‌రావు, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలేరు సంత.. రూ.37.60 లక్షలు

- గత ఏడాదితో పోలిస్తే రూ.16.40లక్షలు తక్కువ



కూసుమంచి: మండలంలోని పాలేరులో ప్రతీ శుక్రవారం నిర్వహించే వారాంతపు సంత వేలాన్ని అధికారులు బుధవారం ఖరారు చేశారు. ఇప్పటికే రెండు సార్లు వేలం నిర్వహించినా పాటదారులు ప్రభుత్వ మద్దతు ధరకు మించి పాడకపోవడంతో వాయిదా వేసిన విషయం విదితమే. ప్రభుత్వ మద్దతు ధర రూ.62.47లక్షలుగా నిర్ణయించగా, పాటదారులు రూ.37.60 లక్షలకు మించి పాడలేదు. పాటదారులు కుమ్మక్కై తక్కువకు పాడారనే ఆరోపణలు వచ్చాయి. అయినా చేసేదేం లేక ఈనెల 14న నిర్వహించిన వేలంలో రూ.37.60 లక్షలకు పాడిన కొత్తూరుకు చెందిన బజ్జూరి ఉపేందర్‌రెడ్డికి సంత ఖరారు చేస్తూ అధికారులు బుధవారం నిర్ణయించారు. కాగా, గత ఏడాది సంతను రూ.54లక్షలకు పాటదారులు దక్కించుకోగా ఈసారి రూ.37.60 లక్షలే రావడంతో రూ.16.40 లక్షల మేర ఆదాయాన్ని గ్రామపంచాయతీ కోల్పోయినట్లయింది.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- అన్ని శాఖల సహకారంతోనే సాధ్యం
- సమీక్షలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు తమవంతు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకర్లు, ఎక్సైజ్, వ్యయ నియంత్రణ కమిటీతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు, బల్క్ లావాదేవీలు, ఒకే అకౌంట్ నుంచి ఎక్కువ సంఖ్యలో జరిగే డిజిటల్ లావాదేవీల నివేదికను బ్యాంకర్లు ప్రతిరోజు సమర్పించాలన్నారు. అలాగే, పెట్రోల్ పంప్, జ్యూయెలరీ యజమానులు రోజువారి నగదు లావాదేవీలపై వివరాలు ఇవ్వాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.1,69,904 విలువైన మద్యం స్వాధీనం చేసుకుని, 21 బెల్ట్ షాపులను సీజ్ చేశామని తెలిపారు. కాగా, ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశమై ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, సీపీఓ శ్రీనివాస్, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపాలెం : పోలింగ్ కేంద్రంలో వసతులపై ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమ్

పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులు

ఖమ్మంరూరల్/రఘునాథపాలెం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన ఓటర్లకు ఇబ్బంది ఎదురుకాకుండా అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా, మద్దులపల్లి, పొన్నెకల్ గ్రామాలతో పాటు రఘునాథపాలెం మండలం జగ్యాతండా, చెరువుకొమ్ము తండా, వేపకుంట్ల, చింతగుర్తి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్, టాయిలెట్ల వసతులపై ఆరాతీసి అవసరమైన మరమ్మతులు చేయించాలని తెలిపారు. ప్రహరీలపై ఓటర్లకు అవగాహన కల్పించేలా నినాదాలు రాయించాలని చెప్పారు. కాగా, ఖమ్మం రూరల్ మండలం పర్యటన సందర్భంగా పొన్నెకల్ వద్ద నిర్మాణంలో ఉన్న రహదారిని సైతం కలెక్టర్ పరిశీలించి నేషనల్ హైవే ఈఈ యుగేందర్‌కు సూచనలు చేశారు. ఈకార్యక్రమాల్లో ఎస్‌డీసీ రాజేశ్వరి, పీఆర్ ఎస్‌ఈ చంద్రమౌళి, ఈఈ వెంకటరెడ్డి, ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్లు రాంప్రసాద్, విల్సన్, ఎంఈఓలు శ్యాంసన్, శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు నాగేషు, వెంకటరెడ్డి, విశ్వనాథ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలగొద్దు

వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీ సునీల్‌దత్



వీసీలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్



ఖమ్మం క్రైం: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. జిల్లాలోని పోలీసు అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రౌడీషీటర్లు, ఇతర కేసులు ఉన్న వారిపై నిఘా వేయాలని, ఏదైనా అనుమానం వస్తే బైండోవర్ చేయాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారెవరైనా ఉపేక్షించొద్దని ఆదేశించారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని తెలిపారు. జిల్లాలోని చెక్‌పోస్టుల వద్ద 24గంటల పాటు తనిఖీలు చేపడుతూనే సాధారణ ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని చెప్పారు. లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగిన వారితో పోలీసుస్టేషన్లలో డిపాజిట్ చేయించాలని, సీ-విజిల్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో విధులు సులభతరం చేసేలా ఒక్కో స్టేషన్ పరిధిని మూడు నుండి నాలుగు సెక్టార్లగా విభజించి ఎస్సై, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఈ వీసీలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏఎస్పీ అవినాష్ కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు కసరత్తు



- ఈ ఏడాది లక్ష్యం 1.20 లక్షల మెట్రిక్ టన్నులు
- నేడు, రేపు ఉన్నతాధికారుల సమీక్ష

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ ఏడాది 1.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. యాసంగిలో 41,477 హెక్టార్లలో వరి సాగు చేయగా... 2,45,984మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ప్రైవేట్ మార్కెట్, మిల్లర్ల కొనుగోలు, రైతుల సొంత అవసరాలు పోగా ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాలకు 1.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని భావిస్తున్నారు. ఇందుకోసం 223 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఐకేపీ ద్వారా 41, పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన 152, డీసీఎంఎస్ పరిధిలో 30 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావనకు వచ్చారు. కాగా, ప్రభుత్వ కేంద్రాల్లో గ్రేడ్-ఏ ధాన్యం క్వింటాకు రూ.2,203, కామన్ రకమైతే రూ.2,183 చెల్లించనున్నారు.

వచ్చేనెల నుంచి మొదలు

రబీలో రైతులు సాగు చేసిన వరి కోతలు ఇంకా మొదలుకాలేదు. ఈనెలాఖరు వరకు కొనుగోళ్లు మొదలైతే వచ్చేనెల 1వ తేదీ నుంచి దశల వారీగా ధాన్యం కేంద్రాలు తెరవాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. అలాగే, గన్నీ బ్యాగుల కొరత రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 30లక్షల గన్నీ సంచులు అవసరమని భావిస్తుండగా... జిల్లాలో కోటికి పైగా బ్యాగ్‌లు ఉండడంతో ఇబ్బందేమీ రాదని భావిస్తున్నారు.

పకడ్బందీగా కొనుగోళ్లు

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఎండలు పెరగనున్న నేపథ్యాన కేంద్రాల్లో నీడ కోసం ఏర్పాట్లు, తాగునీరు ఇతర వసతులు సమకూర్చనున్నారు. కేంద్రాలకు కావాల్సిన టార్పాలిన్లు, తేమ నిర్ధారణ యంత్రాలు, ధాన్యంలో తాలు వేరే చేసే యంత్రాలు, కాంటాలు ఇతర పరికరాలను సిద్ధం చేస్తున్నారు. కాగా, ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై కలెక్టర్ గౌతమ్ గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించనుండగా, ఈనెల 22వ తేదీన రాష్ట్రస్థాయి అధికారులు సైతం సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది.

రమణీయం..రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం రమణీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తనిఖీలు ముగిసినట్లేనా?

జిల్లాలో ఫెర్టిలిటీ సెంటర్ల ఇష్టారాజ్యం

- ఒకరోజు తనిఖీ చేసి చేతులు దులుపుకున్న అధికారులు
- రెండు సెంటర్లను సీజ్ చేసినా తదుపరి చర్యలపై మీనమేషాలు
- నోటీసులు అందుకున్న సెంటర్లపై దృష్టి సారించని యంత్రాంగం

ఖమ్మం వైద్యవిభాగం: సంతానం లేని దంపతుల ఆశలతో చెలగాటమాడుతున్న సంతాన సాఫల్య కేంద్రాలపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటుండడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల ఫిర్యాదులు అందడంతో హడావుడిగా తనిఖీ చేసి రెండు సెంటర్లను సీజ్ చేసినా తదుపరి చర్యలపై ఉలుకూపలుకూ లేకపోవడంతో సెంటర్ల నిర్వాహకులు యథేచ్ఛగా తమ దందా సాగించే అవకాశముంది. సంతానం కోసం తపించే దంపతులను టార్గెట్ చేసి అందిన కాడికి దండుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప అడ్డుకట్ట పడేఅవకాశం లేదని పలువురు చెబుతున్నారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారుల బృందం జిల్లాలో ఇటీవల చేపట్టిన తనిఖీల్లో 30 సంతాన సాఫల్య కేంద్రాలకు అనుమతి లేదని తేలింది. దీంతో రెండు ఆస్పత్రులను సీజ్ చేసినా.. ఇతర ఆస్పత్రుల యాజమాన్యాల్లో కదలిక రావడం లేదు. యథావిధిగా దందా సాగిస్తూ రూ.లక్షల్లో మూటగట్టుకుంటున్నారు.

అక్రమాలకు కేరాఫ్...

గత సోమవారం హైదరాబాద్ నుండి వచ్చిన అధికారులు జిల్లా కేంద్రంలోని పది ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు చేశారు. రోజంతా సాగిన తనిఖీల్లో అనేక అక్రమాలు వెలుగు చూసినట్లు సమాచారం. అనుమతి లేకుండానే సెంటర్లు నడిపిస్తున్నట్లు తేలగా రెండు ఆస్పత్రులను సీజ్ చేశారు. అలాగే నిబంధనలు పాటించడం లేదని మరో ఐదింటికి నోటీసులు జారీ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా మిగతా వాటిపై చర్యలు తీసుకోకుండా వెళ్లడం అనుమానాలకు తావిస్తోంది. మరోపక్క నోటీసులు ఇచ్చిన ఆస్పత్రులపై కూడా చర్యలు లేకపోవడం గమనార్హం. దీంతో సెంటర్ల నిర్వాహకులు మరుసటి రోజు నుంచే తమ దందా మొదలుపెట్టేశారు.

రూ.లక్షలు ధారపోస్తున్న దంపతులు

వివాహం జరిగి ఏళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టకపోవటంతో కుటుంబ సభ్యుల ఒత్తిడి, పిల్లలపై ఆశతో దంపతులు ఈ ఫెర్టిలిటీ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో సెంటర్ల నిర్వాహకులు వందశాతం ఫలితం ఉంటుందని నమ్మబలుకుతూ చికిత్స పేరిట నెలల తరబడి తిప్పిస్తూ రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. సాధారణంగా పిల్లలు కలగని దంపతులకు ఐయూఐ, ఐవీఎఫ్, సరోగసీ విధానాల్లో చికిత్స ఉంటుంది. ఐయూఐ విధానంలో భర్త నుండి వీర్యకణాలు సేకరించి కదలిక ఉన్న శుక్రకణాలను సిరెంజీ ద్వారా భార్య గర్భాశయంలోకి పంపిస్తారు. కొన్ని రోజులపాటు వారు చికిత్స కోసం సెంటర్లకు రావాల్సి ఉంటుంది. అలాగే ఐవీఎఫ్ విధానంలోనైతే భార్య నుండి అండాలు, భర్త నుండి శుక్రకణాలను సేకరించి ఫలదీకరించాక అండాన్ని భార్య గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. ఇక మహిళ గర్భాశయానికి సమస్య ఉంటే సరోగసీ విధానంలో చికిత్స చేస్తారు. అద్దె గర్భాన్ని ఎన్నుకుని భర్త వీర్యకణాలు ప్రవేశపెట్టి, ఆతర్వాత ఆ మహిళకు పుట్టిన బిడ్డను దంపతులను అందజేస్తారు. ఈ విధానంలో చికిత్స కోసం జిల్లా స్థాయి కమిటీ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కానీ జిల్లాలోని కొన్ని ఫెర్టిలిటీ సెంటర్లు అనుమతి లేకుండానే చికిత్స చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సరైన నిబంధనలు పాటించకపోవడంతో ఫలితాలు తక్కువగా ఉండడంతో పిల్లల్ని కనాలనే ఆశతో ఉన్న దంపతులను నెలల తరబడి తిప్పిస్తుండగా నష్టపోతున్నారు. ఇకనైనా వైద్య, ఆరోగ్య శాఖ పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే తప్ప ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వాహకుల ఆగడాలకు అడ్డుకట్టపడడం కష్టమేననే భావన వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

ఉప రాష్ట్రపతిని కలిసిన ఎంపీ వద్దిరాజు



ఎంపీ రవిచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న ధన్‌ఖర్

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభకు రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర బుధవారం ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేలు ఉంచిన నమ్మకంతో ప్రజాసమస్యలపై చర్చిస్తూ పరిష్కారానికి పాటుపడాలని ఎంపీకి సూచించారు. అనంతరం చైర్మన్‌కు ఎంపీ రవిచంద్ర ధన్యవాదాలు తెలిపారు.

గిడ్డంగుల సంస్థ చైర్మన్ 'రాయల'కు సన్మానం



రాయలను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రాయల నాగేశ్వరరావును ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టించి పనిచేసే తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. అధిష్టానానికి జిల్లాపై మంచి అభిప్రాయం ఉన్నందున, ఇక్కడి నేతలకు మరిన్ని పదవులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్, నాయకులు పాలకుర్తి నాగేశ్వరరావు, మారం కరుణాకర్‌రెడ్డి, సామినేని సురేష్, అప్పారావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 18మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, టీఎస్‌కేసీ ఆధ్వర్యాన బుధవారం జాబ్‌మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. హెటిరో కెమికల్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 18మంది విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంపెనీ ప్రతినిధులు నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వరరెడ్డి, జీవన్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రమా సత్యవతి, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ పి.అనురాధ, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ వి.సాంబశివరావు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌లో అధికారుల మార్పు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పదో తరగతి పరీక్షల పర్యవేక్షణకు నియమించిన రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల్లోని కీలక అధికారులు ఇద్దరిని మార్పు చేశారు. ఖమ్మం అర్బన్ ఎంఈఓ శ్రీనివాస్, సత్తుపల్లి ఎంఈఓ రాములు ఆ విధుల నుంచి తప్పించి, కొణిజర్ల, వైరా ఎంఈఓలకు బాధ్యతలు అప్పగించారు. ఈవిషయమై డీఈఓ సోమశేఖరశర్మను వివరణ కోరగా పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ విధులకు వారిని కేటాయించినట్లుగా తెలిపారు. కాగా, పరీక్షలు ప్రారంభమైన మొదటిరోజే ఒక ఇన్విజిలేటర్ విధుల నుంచి తొలగించగా, ఇప్పుడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లో కీలకంగా ఉన్న ఇద్దరు ఎంఈఓలను మార్చడం అనుమానాలకు తావిస్తోంది.

పాఠశాల వంటగదిలో సామగ్రి చోరీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకుల గదిలో చోరీ జరిగింది. పాఠశాలలో వంట నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న షిర్డీసాయి సమాఖ్య బాధ్యులు ఓ గదిలో సామగ్రి నిల్వచేశారు. గుర్తుతెలియని మంగళవారం తాళాలు పగలగొట్టి అందులోని కంది పప్పు, నూనె డబ్బా, ఇతరత్రా సరుకులు, వంట పాత్రలను చోరీ చేశారు. బుధవారం ఉదయం ఈవిషయాన్ని గుర్తించిన నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,041	6,450
కందులు	9,050	9,050
మినుములు	7,400	7,400
మిర్చి	20,100	12,000
తాలు మిర్చి	11,600	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,045

సరిహద్దులపై ప్రత్యేక నిఘా

ఎన్నికల వేళ అంతర్రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టుల ఏర్పాటు

- డబ్బు, మద్యం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట
- 24గంటల పాటు వాహనాల తనిఖీలు
- ఇప్పటికే జిల్లాకు చేరిన కేంద్ర బలగాలు



వాహనాలను తనిఖీ చేస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

ఖమ్మంక్రైం: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో డబ్బు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయడంపై పోలీసు శాఖ దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు పలు జిల్లాలకు ఖమ్మం సరిహద్దుగా ఉండడంతో ఆయా ప్రాంతాల్లో పోలీసులు ఇప్పటికే చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఆయా సెంటర్లలో 24గంటల పాటు వాహనాలు తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. సరిహద్దు దాటి మద్యం, డబ్బు అక్రమంగా జిల్లాకు చేరకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

చెక్ పోస్టులు.. నిఘా

జిల్లాలో పది అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, ఎనిమిది అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఆయా చెక్‌పోస్టుల్లో 24గంటలు ప్రత్యేక నిఘా ఉండేలా సీపీ సునీల్‌దత్ దృష్టి సారించారు. జిల్లాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సరిహద్దుగా ఉండడంతో ఆయా ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీ చేపడుతున్నారు. తెలంగాణలో లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్‌లో జమిలీ ఎన్నికలు జరుగుతుండడంతో ఎట్టి పరిస్థితుల్లో నగదు, మద్యం సరిహద్దులు దాటకుండా తనిఖీలకు చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. పోలీసుశాఖతో పాటు రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బందితో బృందాలను ఏర్పాటుచేసి తనిఖీలు చేపడుతుండడమే కాక అత్యవసరాలకు నగదు తీసుకెళ్లే వారు వెంట సరైన పత్రాలు ఉంచుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

కేంద్ర బలగాలు సైతం..

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఇప్పటికే కేంద్రబలగాలు జిల్లా కేంద్రానికి చేరాయి. త్వరలోనే ఇంకా బలగాలు రానున్నందున అన్ని చెక్ పోస్టుల్లో విధులు నిర్వర్తించనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయాన భారీగానే డబ్బు, అక్రమ మద్యం సీజ్ చేసిన విషయం విదితమే. ఈసారి కూడా పోలీసులు వీటిపైనే దృష్టి సారించి తనిఖీలు ముమ్మరం చేయనున్నారు.

కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్



కవాతులో పాల్గొన్న ట్రెయినీ ఐపీఎస్ మౌనిక, అధికారులు, కేంద్ర బలగాలు

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు భయాందోళనకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంతో పాటు వైరా, సత్తుపల్లి, మధిర, ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యాన వివిధ ప్రాంతాల్లో బుధవారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్(కవాతు) నిర్వహించినట్లు వెల్లడించారు. ఓటర్లకు భరోసా కల్పించడంతో పాటు నేరాలకు పాల్పడే వారికి అడ్డుకట్ట వేసేలా సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, నేరచరితులను బైండోవర్ చేస్తామని, లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాగా, కవాతులో ట్రెయినీ ఐపీఎస్ మౌనిక, అధికారులు పాల్గొన్నారు.

అక్కడక్కడా తేలికపాటి వాన

- జిల్లాలో తగ్గిన ఉష్ణోగ్రతలు
- ప్రభుత్వ సూచనలతో నివేదిక సమర్పించిన అధికారులు



ఖమ్మం మయూరిసెంటర్ : జిల్లా కేంద్రంలో కురుస్తున్న చిరుజల్లులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం తేలికపాటి వర్షపాతం నమోదైంది. ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండగా.. జిల్లాలోనూ రెండు రోజులుగా ఆ ప్రభావం కనిపిస్తోంది. ఈమేరకు బుధవారం కొన్నిచోట్ల వర్షం కురవగా, ప్రభుత్వం వివిధ శాఖల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. అకాల వర్షాలతో పంటలకు నష్టం జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్న సూచనలతో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు నివేదిక సిద్ధం చేశారు. అయితే, జిల్లాలో ద్రోణి ప్రభావం పెద్దగా లేదని, బుధవారం మాత్రం ఖమ్మం సహా పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయని నివేదిక సమర్పించారు. ఈదురుగాలులు లేకపోవడం, వర్ష ప్రభావం కూడా పెద్దగా లేకపోవడంతో సాగులో ఉన్న పంటలకు నష్టం జరగలేదని అందులో పేర్కొన్నారు. అయితే, వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో రైతులు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరింత తగ్గిన ఉష్ణోగ్రతలు

ద్రోణి ప్రభావంగా జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరికొంత తగ్గాయి. బుధవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండి, ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాలే కాక రఘునాథపాలెం మండలంలోని వీవీ పాలెం, కలెక్టరేట్‌తో పాటు పలు ప్రాంతాల్లో జల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. జిల్లాలో అత్యధికంగా వైరాలో అత్యధికంగా 36.1 డిగ్రీలు, అత్యల్పంగా రఘునాథపాలెం మండలం మంచుకొండలో 31.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక జిల్లా సగటు ఉష్ణోగ్రత 32 డిగ్రీలుగా నమోదైందని అధికారులు వెల్లడించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మువ్వా, యలగొండస్వామి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో విజయ్‌బాబు, మంత్రి పొంగులేటి



సీఎం రేవంత్‌రెడ్డితో యలగొండస్వామి, పక్కన మంత్రి తుమ్మల, ఎంపీ రేణుకాచౌదరి

సత్తుపల్లి/ముదిగొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా తన నియామకంపై ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మువ్వా వెంట ఆయన కుమారుడు ధనుష్, కుమార్తె ఆశ్లేషతో పాటు వికాస్ ఉన్నారు. అలాగే, ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరితో పాటు సీఎంను కలిసిన ఆయన ముదిగొండ మండల సమస్యలను విన్నవించారు. మండలంలోని పండ్రేగుపల్లి, ముత్తారం, వల్లాపురం, గంధసిరి, పెద్దమండవ, మల్లారం గ్రామాలను ఆనుకుని ఉన్న మున్నేరుకు లిఫ్టుల నిర్మాణానికి సహకరించాలని కోరారు. సాగు, తాగునీటి సమస్యలు లేకుండా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీసాయి న్యూరో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న నారాయణరావు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ఎన్ఎస్‌టీ రోడ్డులో ఏర్పాటుచేసిన శ్రీసాయి న్యూరో, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యజమాన్య ప్రతినిధి మోదుగు వీరభద్రం, న్యూరో ఫిజీషియన్ ఏ.హర్షవర్ధన్ మాట్లాడుతూ జిల్లాలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆస్పత్రిని స్థాపించినట్లు తెలిపారు. ఆస్పత్రిలో మెడనొప్పి, నడుమునొప్పి, నరాల బలహీనతలు, తలనొప్పి, తల తిరగడం, పక్షవాతం, మూర్ఛ, నిద్రలేమి వంటి తదితర సమస్యలకు చికిత్స అందిస్తామన్నారు. అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన ఆస్పత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కార్పొరేటర్ క్లైమెంట్, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, సామల అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య నిత్యాన్నదానానికి విరాళం



నిత్యాన్నదాన దాతకు రశీదు ఇస్తున్న ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి ఏపీకి చెందిన భక్తులు బుధవారం విరాళం అందచేశారు. గుంటూరులోని వెంకటరమణ కాలనీకు చెందిన పి.నాగమారుతి కుమారి ఆలయ అధికారులకు రూ.1,11,911 విరాళం అందజేసి స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు లింగాల సాయిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాటేజీ శంకుస్థాపనలో పాల్గొన్న ఈఓ రమాదేవి, మాజీ ఈఓ రామకృష్ణంరాజు, తదితరులు

కాటేజీ నిర్మాణానికి శంకుస్థాపన

భద్రాచలంలోని రంగనాయకుల గుట్టపై నాగార్జున సిమెంట్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యాన కాటేజీ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.కోటి వ్యయంతో ఈ కాటేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, మాజీ ఈఓ రామకృష్ణంరాజు, ఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ ఖరారు?

- సామాజిక మాధ్యమాల్లో మ్యాప్



ప్రతిపాదన రైల్వేలైన్ మ్యాప్ ఇదే...

కూసుమంచి: డోర్నకల్ నుండి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల వరకు నూతనంగా నిర్మించనున్న రైల్వే లైన్‌కు సంబంధించి అలైన్‌మెంట్ ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతిపాదిత మ్యాప్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా, స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ లైన్ కూసుమంచి మండలంలోని ధర్మాతండా, కూసుమంచి, గురువాయిగూడెం తండా, జుజుల్‌రావుపేట మీదుగా జాతీయ రహదారిని దాటుతూ సూర్యాపేట వెళ్లనున్నట్లు సర్వే సంస్థ విడుదల చేసినట్లు చెబుతున్న మ్యాప్ వైరల్ అయింది. ఇటీవలే ఈ లైన్ కోసం బోయింగ్ విమానం ద్వారా సర్వే చేసిన విషయం తెలిసిందే.

ఆ ఇద్దరి చదువుల బాధ్యత నాదే...

కేజీబీవీ విద్యార్థినులను దత్తత తీసుకున్న ఎస్సై సూరి



చర్ల కేజీబీవీలో దత్తత తీసుకున్న విద్యార్థినులతో ఎస్సై సూరి

చర్ల రూరల్: తల్లిదండ్రులను కోల్పోయినా విద్యలో రాణిస్తున్న ఇద్దరు పేద విద్యార్థినులను దత్తత తీసుకుని, వారి చదువుల బాధ్యతను చర్ల ఎస్సై టీవీఆర్.సూరి స్వీకరించారు. చర్లలోని కస్తూర్బా పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను కోల్పోయిన అనిత, తల్లిని కోల్పోయిన శిరీష పరిస్థితి తెలుసుకుని చలించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులిద్దరు ఎంత వరకు చదివినా తనదే బాధ్యత అని, ఏ ప్రాంతంలో ఉన్నా వారికి సహకరిస్తానని తెలిపారు. ఆడపిల్లలు క్రమశిక్షణతో విద్యలో రాణించి ప్రయోజకులై ఇంకొందరికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఇప్పటికే పినపాక మండలంలో ముగ్గురు విద్యార్థినులను దత్తత తీసుకుని చదివిస్తున్న ఎస్సై, ఇప్పుడు ఇంకో ఇద్దరి చదువు బాధ్యత స్వీకరించడంపై పలువురు అభినందించారు.

వేటగాళ్ల ఉచ్చులకు కొండగొర్రె బలి

- మాంసాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు
- నలుగురిపై కేసు నమోదు



నిందితుడు అంజిని అదుపులోకి తీసుకుంటున్న అటవీ అధికారులు

కారేపల్లి: వేటగాళ్ల ఉచ్చులకు ఓ కొండగొర్రె బలైంది. కారేపల్లి ఫారెస్టు రేంజ్ పరిధి రేలకాయలపల్లి అటవీప్రాంతంలోని లక్ష్మీపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సిద్ధార్థరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చీమలపాడు ఫారెస్టు సెక్షన్‌లో కొందరు మంగళవారం రాత్రి విద్యుత్ తీగలు అమర్చగా, కొండగొర్రె తాకి మృత్యువాత పడింది. అనంతరం వేటగాళ్లు లక్ష్మీపురంలో బుధవారం కొండగొర్రెను కోసి మాంసం పోగులు వేసుకోవడంతో పాటు మిగతాది అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో అటవీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రెండు కేజీల కొండగొర్రె మాంసమే కాక వండిన కూర స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదుచేశారు. వీరిలో ముగ్గురు పరారు కాగా నిందితుల్లో ఒకరైన పడిగె అంజిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్ఆర్‌ఓ తెలిపారు.

అనారోగ్యంతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



బాలరాజు (ఫైల్)



బాలరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీస్ అసోసియేషన్ నాయకులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ ఇస్లావత్ బాలరాజు(34) కామెర్ల వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన ఆయన కొన్నేళ్లుగా ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న బాలరాజు మృతి చెందగా, స్వస్థలానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ గిరిధర్‌రెడ్డి, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, సిబ్బంది ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

బస్సులో నుంచి కింద పడిన మహిళ

- రద్దీగా ఉండడంతో తోపులాట



బస్సులో నుంచి కింద పడిన రమాదేవి

నేలకొండపల్లి: ఆర్‌టీసీ బస్సు నుంచి ఓ మహిళ ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... నేలకొండపల్లికి చెందిన కందరబోయిన రమాదేవి నేలకొండపల్లి నుంచి ఖమ్మం వెళ్లేందుకు కోదాడ నుంచి వస్తున్న బస్సు ఎక్కింది. అయితే, బస్సు రద్దీగా ఉండడంతో మండల కేంద్రంలోని చెరువు కట్ట దాటుతుండగా తోపులాట జరగడంతో రమాదేవి బస్సులో నుంచి కింద పడింది. దీంతో ఆమె తల, ముఖానికి బలమైన గాయాలయ్యాయి. అయితే, ఆమె పడిపోయిన సమయాన రహదారిపై పలు వాహనాలు వెళ్తుండగా పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. కాగా, రమాదేవిని మారిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు ఆస్పత్రికి తరలించారు.

అష్టగుర్తి ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడంతో చర్యలు

వైరారూరల్: అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లిన ఉపాధ్యాయుడిని విద్యాశాఖ ఉన్నతాధికారులు బుధవారం సస్పెన్షన్ చేశారు. వైరా ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు వెల్లడించిన సమాచారం మేరకు... మండలంలోని అష్టగుర్తి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్‌జీటీ వై.మధుబాబు తన తండ్రి అనారోగ్యానికి గురయ్యారని ఫిబ్రవరి 13 నుండి 19వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఆతర్వాత విద్యాశాఖ అధికారుల అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లినట్లు అందిన సమాచారంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆయనను సస్పెండ్ చేశారు. తండ్రి అనారోగ్యానికి గురయ్యారని మధుబాబు సెలవు పెట్టారే తప్ప విదేశాలకు వెళ్లేందుకు అనుమతి తీసుకోలేదని ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉపాధ్యాయుడిని బెదిరించి, దుర్భాషలాడిన ఇద్దరిపై కేసు

కారేపల్లి: ప్రభుత్వ పాఠశాలలోకి చొరబడి విధుల్లో ఉన్న ఉపాధ్యాయుడిని దుర్భాషలాడడమే కాక బెదిరించిన ఇద్దరిపై కారేపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈనెల 14వ తేదీన కారేపల్లిలోని బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి ఇద్దరు వ్యక్తులు జర్నలిస్టులమంటూ ప్రవేశించి, ఇన్‌చార్జి హెచ్‌ఎం గణపారపు వెంకటేశ్వర్లును బెదిరించారు. దుర్భాషలాడుతూ ఉపాధ్యాయుల హాజరు పట్టిక, సెలవు చీటీలను ఫొటోలు తీసుకున్నారు. ఈ ఘటనపై ఉపాధ్యాయుడి ఫిర్యాదుతో గోవింద వెంకటేశ్వర్లు, జిల్లపల్లి వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారాం వెల్లడించారు.

రైలుకింద పడి ఆత్మహత్య

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన బోళ్ల గోపి(24) బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో మానసికంగా కుంగిపోయిన ఆయన సైకిల్‌పై సమీపంలోని ట్రాక్ వద్దకు వెళ్లి రైలు కిద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని కొంగరకు చెందిన ఎం.ఆదాం(20) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొద్దిసేపటికి గమనించిన స్థానికులు ఆయనకు నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరంఖమ్మం తరలించారు. అయితే, ఆయన ఆత్మాహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.